
# బలగం BALAGAM TV

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ మంగళవారం 13 మే 2025 | www.balagamtv.com | పేజీలు 4

దేశంలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డి రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మతో భేటీ అయ్యారు. పరిశ్రమలు, ఐటీ శాఖల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో కలిసి ముఖ్యమంత్రి రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను కలిసి రాష్ట్రంలో పరిస్థితులను వివరించారు.

## న్యూక్లియర్

# బ్లాక్ మెయిల్‌ను సహించం

- టెర్రరిస్టులు సైతం ఊహించలేని దెబ్బ తీశాం
- కాల్పుల విరమణకు పాక్ పరిగెత్తుకొచ్చింది
- భారత్ నిర్ణయాల మేరకే చర్చలు
- భారత సైన్యానికి సెల్యూట్
- భారత్ సత్తా ఏంటన్నది పాక్ కు అర్థమైంది
- కనీసం పాక్ యుద్ధవిమానాలు గాల్లోకి ఎగరలేని పరిస్థితి కల్పించాం
- ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా భారత్ తుదిముట్టిస్తుంది
- జాతిని ఉద్దేశించి ప్రసంగించిన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ



**బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో**

పహల్గాం ఉగ్రదాడికి ప్రతిగా ఇంత పెద్దఎత్తున భారత్ ప్రతిస్పందిస్తుందని టెర్రరిస్టులు సైతం ఊహించలేదని, మన క్షిపణలు, డ్రోన్లు పాక్ ఉగ్రశిబిరాల బీషణంగా గర్జించడంతో టెర్రరిస్టు స్థావరాలు నేలమట్టమయ్యాయని అన్నారు. పాకిస్తాన్ డ్రోన్లను కుప్పలుతెప్పలుగా కూల్చేయడం ద్వారా భారత్ మిలటరీ పవర్ ఏమిటో యావత్ ప్రపంచం చూసిందన్నారు. 'ఆపరేషన్ సింధూర్' సింధూర్ విజయాన్ని ఈ దేశ మహిళలకు అంకితమిస్తున్నామని అన్నారు. ఆపరేషన్ సిందూర్ తర్వాత తొలిసారి జాతిని ఉద్దేశించి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉత్తేజపూర్వక ప్రసంగం చేశారు. ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్న పాకిస్తాన్ చర్యలపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా తుద ముట్టిస్తామని స్పష్టం చేశారు. 'న్యూక్లియర్ బ్లాక్‌మెయిలింగ్'కు పాల్పడితే సహించేది లేదని పాకిస్తాన్‌కు తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. భారత్ నిర్ణయాలకనుగుణంగానే చర్చలు సాగుతాయని, ఇందులో ఎలాంటి అనుమానం లేదని ప్రకటించారు.

"రెండున్నర దశాబ్దాలుగా పాక్‌లో విచ్చలవిడిగా తిరుగుతున్న ఉగ్రవాద తండాలను ఒక్క దెబ్బతో భారత్ తుడిచిపెట్టింది. మనదేశానికి వ్యతిరేకంగా పాక్ నుంచి కుట్రలు పన్నుతున్న వారిని తుదముట్టించింది. మన దెబ్బకు పాక్ నిరాశానిస్పృహల్లో కూరుకుపోయింది. అచేతనావస్థకు చేరుకుంది. దాడులతో ఏటూ పాలుపోని పాక్.. సరిహద్దులోని జనావాసాలు, పాఠశాలలపై దాడికి దిగింది. పాక్ నుంచి ప్రయోగించిన డ్రోన్లు, మిసైళ్లను మన క్షిపణి రక్షణ వ్యవస్థ సరిహద్దులు దాటకుండానే కూల్చేసింది. పాక్ రక్షణ వ్యవస్థలను భారత క్షిపణులు ఛిన్నాభిన్నం చేశాయి. పాక్ వైమానిక స్థావరాలు, రాడార్ స్టేషన్లలో మన మిసైళ్లు విధ్వంసం సృష్టించాయి."అని ఆయన వివరించారు.

ఆపరేషన్ సిందూర్‌లో బలగాలు ఎంతో ధైర్యం ప్రదర్శించాయని, మన సైన్యం తెగువకు, శాస్త్రవేత్తలకు సెల్యూట్ చేస్తున్నానని మోదీ అన్నారు. పాక్ డ్రోన్లను గాలిలోనే సైన్యం కూల్చేసిందని, టెర్రరిస్టులను సమూలంగా మట్టుపెట్టేందుకు సైన్యానికి సంపూర్ణ స్వేచ్ఛను ఇచ్చామని చెప్పారు. "మన ఆడకూతుళ్ల నుదుట సిందూరం తుడిచిపెట్టిన వారు ఎలాంటి ఫలితాన్ని అనుభవించాల్సి వస్తోంది ప్రతీ టెర్రరిస్టు, టెర్రరిస్టు సంస్థకు తెలిసొచ్చింది" అని అన్నారు.ఆపరేషన్ సిందూర్ కేవలం పేరు కాదు, 140 కోట్ల భారతీయుల భావోద్వేగాలకు ప్రతీక అని అన్నారు. పాక్ ప్రేరేపిత ఉగ్రవాదంపై గట్టి హెచ్చరిక చేశారు. అణ్వస్త్రాల బ్లాక్‌మెయిల్‌ను ఇండియా సహించేది లేదని, ఉగ్రవాదం, పాక్ ఆక్రమిత ఆక్రమిత కశ్మీర్‌పైనే పాక్‌తో చర్చలుంటాయని మోదీ స్పష్టం చేశారు.

"ఎలాంటి దుస్సాహసానికి పాక్ తెగబడినా భారత దళాలు చావుదెబ్బ కొట్టేందుకు సిద్ధంగా ఉన్నాయి. సర్జికల్ స్ట్రైక్స్, బాలాకోట్ దాడులు, ఆపరేషన్ సిందూర్.. ఉగ్రవాదంపై భారత్ వైఖరిని విస్పష్టంగా చెప్పాయి. ఉగ్రవాదంపై భారత్ నిర్ణయాల మేరకే చర్చలుంటాయి. ఆ నిర్ణయాలకు అనుగుణంగానే చర్చలు సాగుతాయి. పాకిస్తాన్ అణు బ్లాక్‌మెయిలింగ్ ఇక సహించేది లేదు. అణుశక్తి, అణ్వాయుధాల ఆధారంగా ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తే, ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదు. ఉగ్రవాదం ఏ రూపంలో ఎక్కడ ఉన్నా భారత్ తుదముట్టించి తీరుతుంది. భారత రక్షణ దళాల సామర్థ్యం ఏంటో ఆపరేషన్ సిందూర్ ద్వారా పాక్ చవిచూసింది. సాంకేతిక యుద్ధంలో భారత్ పరిణతి, ఆయుధ సంపత్తిని ప్రదర్శించింది. మేడిన్ ఇండియా రక్షణ వ్యవస్థలు ఎంత బలమైనవో.. ఎంత శక్తిమంతమైనవో చాటింది" అని మోడీ చెప్పారు.

"పౌరులు, పార్టీలన్నీ ఏకతాటిపైకి వచ్చి ఉగ్రవాదానికి వ్యతిరేకంగా నిలిచాయి. భారతీయ మహిళల నుదుటిపై సిందూరం తుడిచేసే వారికి ఎలాంటి బుద్ధి చెప్పాలో అదే 'ఆపరేషన్ సిందూర్'. అని అభివర్ణించారు. ఉగ్రవాదులు కలలో కూడా ఊహించనంత దారుణంగా భారత్ దెబ్బతీసింది. ఉగ్రవాదుల శిబిరాలపై భారత మిసైళ్లు, డ్రోన్లు కచ్చితమైన లక్ష్యం తో దాడులు నిర్వహించాయి. బహావల్‌పూర్, మురుద్కే లాంటి తీవ్రవాద స్థావరాలపై దాడి చేసి భీతావహ పరిస్థితిని సృష్టించాయి. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ఉగ్రవాదు లు, ఉగ్రవాద సానుభూతిపరులకు భారత్ ఏం చేస్తుందో చెప్పింది. పాక్ గర్వంగా చెప్పుకొనే

మిగితా 2వ పేజీలో



# జీసీసీ హబ్‌గా హైదరాబాద్

- ఏఐ-రెడీ డేటా సెంటర్లు, తయారీ రంగాలకు కేంద్రం
- హైదరాబాద్ బ్రాండ్ అంబాసిడర్లుగా మారండి

**పారిశ్రామికవేత్తలకు సీఎం రేవంత్ పిలుపు**

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

ఆర్థిక వృద్ధి, పెట్టుబడులు, ఉద్యోగ కల్పన, ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాల కల్పనతో పాటే సమాజంలోని అన్ని వర్గాల సంక్షేమాన్ని సమతుల్యం చేసుకుంటూ సమగ్రమైన సమ్మిళితమైన అభివృద్ధికి ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. "తెలంగాణ రైజింగ్" అనే ఆలోచనలో ఈ దార్శనికత ఇమిడి ఉందని అన్నారు. నానక్‌రామ్‌గూడలో సొనాటా సాఫ్ట్‌వేర్ నూతన ఫెసిలిటీ సెంటర్ ను ముఖ్యమంత్రి ప్రారంభించారు. తెలంగాణను ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థగా, హైదరాబాద్‌ను ప్రపంచంలోని అద్భుత నగరాల్లో ఒకటిగా తీర్చిదిద్దేందుకు చేపట్టిన ప్రణాళికలను ఈ వేదికగా వివరించారు. అత్యుత్తమ నగరంగా తీర్చిదిద్దడంలో, తెలంగాణ అభివృద్ధిని ప్రపంచం ముందు చాటడానికి ప్రతి ఒక్కరి సహకారం కావాలని, హైదరాబాద్ బ్రాండ్ అంబాసిడర్లుగా పనిచేయాలని కోరారు.

"హైదరాబాద్ గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ల (జీసీసీ) హబ్ గా మారింది. ముఖ్యంగా సాఫ్ట్‌వేర్, లైఫ్ సైన్సెస్, ఏఐ –రెడీ డేటా సెంటర్లలో ప్రముఖంగా నిలుస్తోంది. మైక్రోసాఫ్ట్, కాగ్నిజెంట్, హెచ్‌సీఎల్ టెక్, ఇన్ఫోసిస్, విప్రో వంటి గ్లోబల్ ఐటీ కంపెనీలు హైదరాబాద్‌లో కార్యకలాపాలను విస్తరించాయి. హైదరాబాద్ అంతర్జాతీయ ప్రాముఖ్యత పెరిగింది. ప్రస్తుతం మిస్ వరల్డ్ పోటీలకు ఈ నగరం ఆతిథ్యమిస్తోంది. రానున్న రోజుల్లో మరిన్ని అంతర్జాతీయ ఈవెంట్లు హైదరాబాద్‌లో నిర్వహిస్తాం.

తెలంగాణ అనేక కీలక రంగాల్లో దేశంలోనే మొదటి స్థానంలో ఉంది. కేంద్ర ప్రభుత్వ నివేదికల ప్రకారం పోలీసింగ్ లో గానీ, చట్టాలను సరిగా అమలు చేయడంలోగానీ, ద్రవ్యోల్బణ నియంత్రణ, ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో ఉద్యోగ కల్పన, పన్నుల వసూళ్లలో తెలంగాణ అగ్రగామిగా ఉంది. స్వయం సహాయ సంఘాల ద్వారా 66 లక్షల మందికి పైగా మహిళలకు సాధికారత కల్పిస్తూ, దేశంలోనే అతిపెద్ద స్టార్టప్ ఫండింగ్ మరియు మెంటరింగ్ కార్యక్రమాన్ని తెలంగాణ అమలు చేస్తోంది. రాజీవ్ యువ వికాసం కార్యక్రమం ద్వారా వేలాది యువతకు వ్యాపార, స్వయం ఉపాధి రంగాల్లో మద్దతు అందిస్తున్నాం. అలాగే, సమానత్వం దిశగా కీలక అడుగు వేసిన తెలంగాణ, ట్రాన్స్‌జెండర్ వాలంటీర్లను హైదరాబాద్ ట్రాఫిక్ పోలీస్ బృందంలో చేర్చిన మొదటి రాష్ట్రంగా నిలిచింది.

తెలంగాణలో మౌలిక సదుపాయాలు, వివిధ ప్రాజెక్టుల కోసం డ్రైపోర్టును ఏర్పాటు చేసి ఆంధ్రప్రదేశ్‌లోని సముద్రతీర పోర్టుకు అనుసంధానం చేయనున్నాం. భారతదేశంలోనే అత్యంత శాస్త్రీయంగా ప్రణాళికాబద్ధంగా హైదరాబాద్ సమీపంలో 'ఫ్యూచర్ సిటీ' నిర్మాణాన్ని చేపట్టాం. ఇందులో ప్రత్యేకంగా 'AI సిటీ' కూడా ఏర్పాటు చేస్తున్నాం. యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ స్థాపించడం వంటి అనేక కీలక నిర్ణయాలు తీసుకున్నాం.

2023 డిసెంబర్ నుండి ఇప్పటివరకు తెలంగాణ రూ.3 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించడమే కాకుండా, దాదాపు 1 లక్షకు పైగా ప్రైవేట్ రంగంలో ఉద్యోగాలను కల్పించాం. దావోస్ వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ సమావేశం, అమెరికా, దక్షిణ కొరియా, జపాన్, సింగపూర్ వంటి దేశాల్లో పారిశ్రామిక దిగ్గజాలతో సమావేశాల ద్వారా పెట్టుబడుల ఆకర్షణలో భారతదేశంలోనే అగ్రస్థానంలో తెలంగాణ నిలిచింది. దావోస్ సమావేశంలోనే ?1.78 లక్షల కోట్ల పెట్టుబడులు తెలంగాణకు లభించాయి." అని వివరించారు. తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, ఐటీ మరియు పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు , సోనాటా సాఫ్ట్‌వేర్ మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ సమీర్ ధీర్‌తో పాటు ప్రముఖులు పాల్గొన్నారు.

# బుద్ధవనంలో ప్రపంచ సుందరీమణులు



- స్వాగతం పలికిన కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్ చంద్ర పవార్

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

మిస్ వరల్డ్ పోటీల్లో పాల్గొనేందుకు వచ్చిన వివిధ దేశాలకు చెందిన 22 మంది సుందరీమణులు నల్గొండ జిల్లాలోని నాగార్జునసాగర్ బుద్ధవనంలో పర్యటించారు. వారికి జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి నేతృత్వంలో జానపద, గిరిజన నృత్యాలతో విజయ విహార్ వద్ద స్వాగతం పలికారు. గిరిజన, జానపద నృత్య కళాకారులు ఘనస్వాగతం పలికారు. వారంతా అక్కడి పరిసరాలను చూసి సంతోషం వ్యక్తం చేశారు. బౌద్ధ థీమ్‌పార్క్‌లోని బుద్ధ విగ్రహాల వద్ద జరిగిన ధ్యానం, ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు.అంతకుముందు తెలంగాణ పర్యాటక సంస్థ విజయ్ విహార్‌లో కొంతసేపు విశ్రాంతి తీసుకున్న అనంతరం సుందరీమణులంతా ఫొటోషూట్‌లో పాల్గొని సందడి చేశారు. బుద్ధపూర్ణిమ సందర్భంగా వారంతా బుద్ధవన పర్యటనకు వచ్చినట్లు అక్కడి నిర్వాహకులు తెలి పారు. ఇండియా, ఫిలిప్పీన్స్, సింగపూర్, శ్రీలంక, బంగ్లాదేశ్, కంబోడియా, మయన్మార్, వియత్నాం, జపాన్, కజకిస్థాన్, కిర్గిస్థాన్, లెబనాన్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, ఇండోనేసియా, మంగోలియా, నేపాల్, తుర్కియే, చైనా, థాయ్‌లాండ్, ఆర్మేనియా దేశాలకు చెందిన సుందరీ మణులు బుద్ధవనంకు వచ్చిన వారిలో ఉన్నారు.

ముందుగా వారు నాగార్జున సాగర్ తీరాన ఉన్న విజయ విహార్‌లో ఫొటో షూట్‌లో పాల్గొన్నారు. సాగర్ అందాలను వీక్షించారు. గౌతమబుద్ధుడి జయంతిని పురస్కరించుకుని సాగర్‌లో జరిగిన బుద్ధ పౌర్ణమి వేడుకల్లో వారు పాల్గొన్నారు. బుద్ధవనాన్ని సందర్శించి బుద్ధుడి పాదాలకు పూజలు చేసి మహా స్థూపంలో జ్యోతులు వెలిగించి ధ్యానంలో పాల్గొన్నారు. బుద్ధవనం ప్రాముఖ్యత, బుద్ధుడి జననం నుంచి నిర్యాణం వరకు ఆర్కియాలజిస్ట్ శివనాగిరెడ్డి వివరించారు. అనంతరం లంబాడా కళాకారులు నృత్య ప్రదర్శన ఇచ్చారు. జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్ చంద్ర పవార్, ఎమ్మెల్యేలు కుందూరు జయవీర్‌రెడ్డి, బత్తుల లక్ష్మారెడ్డి, బాలూనాయక్, ఎమ్మెల్సీ శంకర్ నాయక్, ఐఏఎస్ అధికారి లక్ష్మి, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్, ఏస్పీలు రమేష్, మౌనిక, ఆర్డీఓలు, అధికారులు తదితరులు హాజరయ్యారు. భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

# భారత్-పాక్ డీజీఎంవోల మధ్య ముగిసిన చర్చలు

- హాట్‌లైన్‌లో సుమారు గంట పాటు సంప్రదింపులు

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

భారత్, పాకిస్థాన్ డైరెక్టర్ జనరల్స్ ఆఫ్ మిలిటరీ ఆపరేషన్స్ (డీజీఎంఓ) మధ్య హాట్ లైన్ చర్చలు ముగిశాయి. కాల్పుల విరమణ, సైనిక చర్యల నిలుపుదల ఒప్పందాన్ని కొనసాగించడంపై ఇరు దేశాల డీజీఎంఓలు ఈ సందర్భంగా చర్చించారని సమాచారం. అయితే, ఈ చర్చల్లో సింధు నదీ జలాల ఒప్పందం ప్రస్తావనకు రాలేదని తెలుస్తోంది. చర్చల్లో భాగంగా ఈ ఒప్పందం రద్దు అంశాన్ని లేవనెత్తాలని పాకిస్థాన్ ప్రయత్నించినప్పటికీ, అందుకు అవకాశం లభించలేదని జాతీయ మీడియా వర్గాలు పేర్కొన్నాయి. సరిహద్దుల్లో శాంతియుత వాతావరణాన్ని కొనసాగించేందుకు ఉద్దేశించిన అవగాహనపైనే ప్రధానంగా దృష్టి సారించినట్లు తెలుస్తోంది.

వాస్తవానికి ముందుగా నిర్ణయించుకున్న షెడ్యూల్ ప్రకారం డీజీఎంవోలు ఇవాళ మధ్యాహ్నం 12 గంటలకే చర్చలు జరగాల్సి ఉంది. కానీ కారణం ఏమిటో తెలియదుగానీ చర్చలను సాయంత్రం 5 గంటలకు వాయిదా వేస్తున్నట్లు మధ్యాహ్నం ప్రకటించారు. ఆ మేరకు సాయంత్రం మొదలైన డీజీఎంల చర్చలు కాసేపటి క్రితమే ముగిశాయి. భారత డీజీఎంవో రాజీవ్ ఘాయ్, పాకిస్థాన్ డీజీఎంవో కాశీఫ్ ఈ చర్చల్లో పాల్గొన్నారు. కాల్పుల విరమణకు ఇరుదేశాలు అంగీకారం తెలిపిన అనంతర పరిస్థితులు, కాల్పుల విరమణ విధివిధానాలు తదితర అంశాలపై ఈ సమావేశంలో చర్చించినట్లు తెలుస్తోంది. హాట్‌లైన్‌లో ఇంకా ఏం చర్చించారనే వివరాలు తెలియాల్సి ఉంది.

# ఆర్టీఐ కమిషనర్లుగా నలుగురు

- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణలో ఆర్టీఐ(సమాచార హక్కు చట్టం) కమిషనర్లుగా నలుగురిని రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు పీవీ శ్రీనివాసరావు, మొహసినా పర్వీన్, దేశాల భూపాల్, బోరెడ్డి అయోధ్యరెడ్డిని కమిషనర్లుగా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ప్రధాన కార్యదర్శి కె రామకృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం పలువురి పేర్లను ప్రతిపాదిస్తూ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు ఫైల్‌ను పంపింది. తాజాగా ఆయన వాటికి ఆమోదం తెలపడంతో ప్రభుత్వం వారి నియామకంపై ఉత్తర్వులు జారీ చేసింది. కాగా,ఆర్టీఐ కమిషన్ సభ్యులు గా నియమితులైన పీవీ శ్రీనివాస్ రావు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్ రెడ్డి ని నేడు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావును నరేందర్ రెడ్డి అభినందించారు.

# మళ్లీ కాల్పుల విరమణ ఒప్పందం ఉల్లంఘన

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

ఆపరేషన్ సిందూర్ అనంతరం ఇరు దేశాల మధ్య జరిగిన కాల్పుల విరమణ ఒప్పందానికి పాకిస్థాన్ తాజాగా తూట్లు పొడిచింది. సోమవారం రాత్రి జమ్మూ కాశ్మీర్‌లోని సాంబా సెక్టార్‌లోకి పాకిస్థాన్ సైన్యం కాల్పులకు తెగబడింది. సాంబాతోపాటు కథువా, ఆర్‌ఎస్ పుర, ఉదంపూర్ తదితర ప్రాంతాల్లో డ్రోన్లుతో పాకిస్థాన్ దాడికి దిగింది. వీటిని భారత్ సైన్యం తిప్పికొట్టంది. మరోవైపు ఆపరేషన్ సిందూర్ అనంతరం ప్రధాని నరేంద్ర మోదీ జాతిని ఉద్దేశించి ప్రసంగం కొన్ని నిమిషాలకే పాక్ ఈ తరహా చర్యలకు దిగింది. ఇక పాకిస్థాన్‌తో సరిహద్దులుగా ఉన్న పంజాబ్ జిల్లాలతోపాటు రాజస్థాన్‌లోని పలు జిల్లాల్లో బ్లాక్ అవుట్ విధించారు.

# ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్

- 20 మంది మావోయిస్టులు మృతి



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

మావోయిస్టులకు మరో ఎదురు దెబ్బ తగిలింది. ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో చోటు చేసుకున్న ఎన్‌కౌంటర్‌లో 20 మంది మావోయిస్టులు మృతి చెందారు. బీజాపూర్ జిల్లా సరిహద్దుల్లో మావోయిస్టులు ఉన్నారంటూ భద్రతా బలగాలకు నిఘా వర్గాల నుంచి సమాచారం అందింది. ఈ నేపథ్యంలో బీజాపూర్ అటవీ ప్రాంతంలో పోలీసులతోపాటు భద్రతా బలగాలు కూంబింగ్ నిర్వహించాయి. ఆ క్రమంలో భద్రతా బలగాలు తారసపడడంతో.. మావోయిస్టులు కాల్పులు ప్రారంభించారు.దీంతో భద్రతా బలగాలు సైతం వెంటనే స్పందించి కాల్పులు ప్రారంభించాయి. దీంతో ఇరు వైపులా కొన్ని గంటల పాటు హోరా హోరీగా కాల్పులు జరిగాయి. అనంతరం మావోయిస్టుల వైపు నుంచి కాల్పులు ఆగిపోయాయి. దాంతో భద్రతా బలగాలు పరిసర ప్రాంతాల్లో కూంబింగ్ చేపట్టాయి. అందులోభాగంగా ఆ ప్రాంతంలో 20 మావోయిస్టుల మృతదేహాలను భద్రతా బలగాలు కనుగొన్నాయి. అయితే పలువురు మావోయిస్టులు పారిపోయినట్లు భద్రతా బలగాలు భావిస్తున్నాయి. ఆ క్రమంలో కూంబింగ్ చేపట్టాయి. మరోవైపు మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల సరిహద్దుల్లోని గడ్చిరోలి జిల్లాలో మవోయిస్టులకు చెందిన ఆయుధాలను పోలీసులు భారీగా స్వాధీనం చేసుకున్నారు.



# ధాన్యం కుప్పలపైనే అన్నదాత బలి

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

వివరాలు 2వ పేజీలో

# ఉగ్రవాదులను టార్గెట్ చేస్తే పాకిస్థాన్ మిలిటరీ జోక్యం చేసుకుంది

- లెఫ్టినెంట్ జనరల్ రాజీవ్ ఘాయ్



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ 'ఆపరేషన్ సిందూర్' ను విజయవంతంగా చేపట్టిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో త్రివిధ దళాలు మీడియా సమావేశం నిర్వహించి ఆపరేషన్‌కు సంబంధించిన వివరాలను వెల్లడించారు. గత కొన్ని సంవత్సరాలుగా ఉగ్రవాదుల స్వభావం మారిపోయిందని ఈ సందర్భంగా లెఫ్టినెంట్ జనరల్ రాజీవ్ ఘాయ్ అన్నారు. 'గత కొన్నేళ్లుగా ఉగ్రవాదం తీరులో మార్పు వచ్చింది. ఉగ్రవాదులు తమ స్వభావాన్ని మార్చుకున్నారు. అమాయకులను లక్ష్యంగా చేసుకుంటున్నారు. పర్యాటకులు, భక్తులు, యాత్రికులే లక్ష్యంగా దాడులు చేస్తున్నారు' అని రాజీవ్ ఘాయ్ పేర్కొన్నారు.ఆ సమావేశంలో లెఫ్టినెంట్ జనరల్ రాజీవ్ ఘాయ్ మాట్లాడుతూ ఓ క్రికెట్ స్టోరీ చెప్పారు. మన ఎయిర్ ఫీల్డ్‌లను, లాజిస్టిక్స్‌ను టార్గెట్ చేయడం చాలా కఠినమైన అంశమన్నారు. ఆ అంశాన్ని ఆయన వివరిస్తూ ఓ క్రికెట్ సంఘటన గుర్తు చేశారు. అయితే ఇవాళ క్రికెటర్ విరాట్ కోహ్లీ టెస్టుల నుంచి రిటైర్ అయ్యారని, అతను తనకు ఫేవరేట్ క్రికెటర్ అని తెలిపారు.

ఇక 1970 దశకంలో యాషెస్ సిరీస్ ఒకటి జరిగిందని, ఆస్ట్రేలియాకు చెందిన ఇద్దరు బౌలర్లు ఇంగ్లండ్ బ్యాటర్లను ముచ్చమటలు పట్టించారన్నారు. ఇంగ్లండ్ బ్యాటింగ్ లైనప్‌ను ఆస్ట్రేలియా బౌలర్లు జెఫ్ థాంప్సన్, డెన్నిస్ లిల్లీలు కూల్చేశారన్నారు. ఆ సమయంలో ఆస్ట్రేలియాలో ఓ నానుడి వచ్చిందని, యాషెస్ టు యాసెస్, డస్ట్ టు డస్ట్, ఇఫ్ థామో డోంట్ గెట్ యా, లిల్లీ మస్ట్ అన్న ప్రావర్బ్ పుట్టిందన్నారు.



# షరతుల్లేని గిఫ్ట్ డీడ్ రద్దు చెల్లదు..

- హైకోర్టు

**బలగం టీవీ, హైదరాబాద్**

ప్రేమ, వాత్సల్యంతో మనుమళ్లకు ఎలాంటి షరతులు విధించకుండా ఇచ్చిన గిఫ్ట్ డీడ్‌ను సీనియర్ సిటిజన్స్ చట్టం కింద రద్దు చేయడం చెల్లదని హైకోర్టు తీర్పు చె ప్పింది. ఒప్పందంలోని షరతులను ఉల్లంఘించినప్పుడే సీనియర్ సిటిజన్స్ చట్టంలోని సెక్షన్ 23(1) కింద గిఫ్ట్‌డీడ్‌ను రద్దు చేసుకునేందుకు వీలుంటుందని స్పష్టం చేసింది. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం కొండాపూర్‌లోని ఓ భవనంలో తనకు బహూకరిస్తూ ఇచ్చిన గిఫ్ట్ డీడ్‌ను తన తాత (తల్లి నాన్న) ఫిర్యాదు మేరకు ఆర్డీవో రద్దు చేయడంపై అమెరికాలోని రోహిత్ శౌర్య పిటిషన్ దాఖలు చేయడంతో హై కోర్టు ఈ తీర్పు ఇచ్చింది.

# న్యూక్లియర్ బ్లాక్ మెయిల్‌ను సహించం

(మొదటిపేజీ తరువాయి)

మిస్సైళ్లను ధ్వంసం చేశాం. పాకిస్తాన్ విమా నాలు గాల్లోకి ఎగరలేని పరిస్థితిని తీసు కొచ్చాం. ఈ చర్యలకు బెంబే లెత్తిన పాకిస్తాన్ కాల్పుల విరమణ కోసం ప్రపంచం మొత్తాన్ని వేడుకుంది. పాక్ డీజీఎంవో కాల్పుల విరమణ చర్చలకు పరిగెత్తుకుంటూ వచ్చారు" అని ప్రధాని అన్నారు.

"ఈ యుగం యుద్ధాలది కాదు.. ఉగ్రవాదానిది అంతకన్నా కాదు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ఎలాంటి చర్యలు, దాడులకూ భారత్ వెనుకాడదు. ఉగ్రవాదానికి అన్నపానీయాలు అందించే ఎవరినీ ఉపేక్షించదు. పాక్ బతకాలంటే ఉగ్రవాద శిబిరాలను తనంతట తానుగా తుడిచిపెట్టాలి. టెర్రరిజం, చర్చలు రెండూ ఏకకాలంలో ఉండవు. ఉగ్రవాదం, వాణిజ్యం రెండూ ఏకకాలంలో ఉండవు. ఉగ్రవాదం, నీటి పంపిణీ రెండూ ఏకకాలంలో ఉండవు" అని ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాకిస్తాన్‌కు ప్రధాని మోడీ గట్టిగా హెచ్చరికలు పంపారు.

"గడిచిన నాలుగు రోజులుగా భారత సైన్యం సామర్థ్యాన్ని, సంయమనాన్ని చూస్తున్నాం. నిఘా వర్గాల సామర్థ్యం, శాస్త్రసాంకేతిక సామర్థ్యాన్ని దేశం చూసింది. మన దేశం అసమాన వీరత్వాన్ని ప్రదర్శించింది. సైన్యం సాహసం, పరాక్రమానికి నా సెల్యూట్. భారత రక్షణ దళాలు చూపిన ధైర్య సాహసాలు దేశానికి తలమానికం. పహల్గాంలో ఉగ్రవాదులు మతం పేరు అడిగి మరీ కుటుంబ సభ్యుల ముందే కాల్చి చంపారు. ఈ ఉగ్రదాడితో దేశమంతా నివ్వెర పోయింది. ఉగ్రదాడులపై ప్రతి హృదయమూ జ్వలించింది" అని మోడీ అన్నారు.

# ధాన్యం కుప్పలపైనే అన్నదాత బలి

- **బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

ఓ వైపు అందాల పోటీల్లో ముఖ్యమంత్రి మునిగితేలుతుంటే.. మరోవైపు వడదెబ్బకు తాళలేక ధాన్యం కుప్పలపైనే ఓ అన్నదాత బలికావడం అత్యంత బాధాకరం అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. "రేవంత్ చేతకానితనం వల్ల మహబూబాబాద్ జిల్లాలోని పెద్ద వంగర మండలం పోచంపల్లి గ్రామంలో గుగులోతు కిషన్ (51) అనే రైతు నిండుప్రాణం గాలిలో కలిసిపోయింది. ఇది ముమ్మాటికీ ముఖ్యమంత్రి చేసిన హత్యే. పెట్టుబడి సాయం ఎగ్గొట్టినా, రుణమాఫీ పేరిట మోసం చేసినా ఆరుగాలం కష్టించి పండించిన పంటను చివరికి కొనే దిక్కు కూడా లేకపోవడంతో.. తెలంగాణ రైతన్న అనాథలా మారాడు" అని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఓవైపు కొనుగోలు కేంద్రాలకు తెచ్చిన ధాన్యం అకాల వర్షాలతో కండ్లముందే కొట్టుకుపోతున్న దుస్థితి.. మరోవైపు మండుతున్న ఎండలను తట్టుకోలేక రైతుల గుండెలు పగులుతున్న దయనీయ పరిస్థితి.. వీటికి పూర్తి బాధ్యత ఈ దద్దమ్మ కాంగ్రెస్ సర్కారుదే. కొనుగోలు కేంద్రాల్లో వారాల తరబడి పడిగాపులు పడుతున్నా పట్టించుకునే వాడు లేకపోవడంతో అసలు ఈ రాష్ట్రంలో ప్రభుత్వం ఉందా అని ప్రశ్నించే పరిస్థితి ఏర్పడింది. వడదెబ్బకు, సర్కారు నిర్వాకానికి బలైన అన్నదాత కుటుంబాన్ని రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలి. ఇప్పటికైనా ముఖ్యమంత్రికి సోయి ఉంటే.. కొనుగోలు కేంద్రాల్లో పేరుకుపోయిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి రైతుల కష్టాలు తీర్చాలి. లేకపోతే కట్టలు తెంచుకునే అన్నదాతల ఆగ్రహానికి ఈ కాంగ్రెస్ సర్కారు కొట్టుకుపోతుంది అని కేటీఆర్ పేర్కొన్నారు.

# భారీగా తగ్గిన బంగారం

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

గత కొంతకాలంగా అంతర్జాతీయ భౌగోళిక ఉద్రిక్తతల నేపథ్యంలో పరుగులు పెట్టిన బంగారం ధరకు అడ్డుకట్ట పడింది. ముఖ్యంగా అమెరికా, చైనాల మధ్య వాణిజ్య ఉద్రిక్తతలు తాత్కాలికంగా చల్లారడంతో పసిడి ధర గణనీయంగా తగ్గింది. దీంతో బంగారం కొనుగోలుదారులకు కొంత ఊరట లభించినట్లయింది.శనివారం హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 10 గ్రాముల బంగారం ధర రూ. 99,950 వద్ద ముగియగా, సోమవారం సాయంత్రం 6 గంటల సమయానికి ఏకంగా రూ. 3,400 తగ్గి రూ. 96,125 వద్ద ట్రేడ్ అయింది. ఇదే సమయంలో దేశ రాజధాని ఢిల్లీలో 10 గ్రాముల పసిడి ధర రూ. 96,550కి చేరింది. అంతర్జాతీయ మార్కెట్‌లో కూడా ఔన్సు బంగారం ధర ఇటీవల 3,400 డాలర్ల పై స్థాయిల నుంచి 3,218 డాలర్లకు దిగివచ్చింది. వెండి ధర కూడా స్వల్పంగా తగ్గింది. కిలో వెండి ధర రూ. 200 తగ్గి రూ. 99,700 వద్ద కొనసాగుతోంది.

# టీజీఐఐసీ పరిధిలో లక్షా 75 వేల ఎకరాల తాకట్టుకు కుట్ర

- **స్కెచ్ వేసిన రేవంత్ రెడ్డి**
- **నా దగ్గర నిర్దిష్టమైన ఆధారాలు ఉన్నాయి**
- **టీజీఐఐసీని ప్రైవేట్ లిమిటెడ్ నుంచి పబ్లిక్ లిమిటెడ్ కంపెనీగా మార్చడానికి ప్రభుత్వం రహస్య జీవోను విడుదల చేసింది.**
- **తెలంగాణ భూములను స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో కుదువపెట్టే కుట్ర**
- **ఎమ్మెల్సీ కవిత**



**బలగం టీవీ, హైదరాబాద్**

కేసీఆర్ హయాంలో పరిశ్రమల ఏర్పాటు కోసం సిద్ధం చేసిన 1.75 లక్షల ఎకరాల భూములను కాంగ్రెస్ సర్కారు స్టాక్ ఎక్సైంజ్‌లో కుదువ పెట్టేందుకు కుట్రలు చేస్తున్నదని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సంచలన ఆరోపణలు చేశారు. ప్రైవేట్ కంపెనీ అయిన టీజీఐఐసీని పబ్లిక్ లిమిటెడ్ కంపెనీగా మారుస్తూ గత ఏప్రిల్ 15న జీవో నంబర్ 24ను దొడ్డిదారిన జారీ చేసి రుణం తెచ్చేందుకు స్కెచ్ వేసిందని నిప్పులు చెరిగారు. 'నిజంగా ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే పబ్లిక్ డొమైన్‌లో ఉంచాల్సిన ఉత్తర్వులను దాచిపెట్టడం ఎందుకు? విలువైన భూములను స్టాక్ ఎక్సైంజ్‌లో పెట్టాల్సిన అవసరం ఎందుకొచ్చింది? ఏదైనా పరిస్థితుల్లో నష్టం వస్తే భూముల పరిస్థితి ఏమిటి? మన పిల్లల భవిష్యత్తును పణంగా పెట్టడం ఎందుకు?.. హెచ్‌సీయూకు చెందిన 400 ఎకరాలను కుదవబెట్టి తీసుకొచ్చిన రూ. 10 వేల కోట్లను ఏ ప్రాజెక్టు కోసం ఖర్చు చేశారు? ఏపథకం అమలుకు వెచ్చించారు? ' అంటూ ప్రశ్నల వర్షం కురిపించారు. నిర్దిష్టమైన ఆధారాలతో తాను చేస్తున్న ఆరోపణలకు ప్రభుత్వం సమాధానం చెప్పాలని, ఒకవేళ తన ఆరోపణలు తప్పని భావిస్తే శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

బీఆర్ఎస్ పాలనలో రూ. 8 లక్షల కోట్ల అప్పులు చేసి రాష్ట్రాన్ని దివాలా తీయించారని దివాలాకోరు మాటలు మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి, 17 నెలల్లో రూ.1.80 లక్షల కోట్ల అప్పు ఎందుకు తెచ్చారని కవిత ప్రశ్నించారు. తెచ్చిన రుణాల్లో కేవలం రూ.80 వేల కోట్లు మాత్రమే అప్పులు చెల్లించారని, మిగిలిన లక్ష కోట్లతో బడా కాంట్రాక్టర్ల జేబులు నింపారని ఆరోపించారు. ఇం దులో సీఎం రేవంత్‌రెడ్డి 20శాతం కమీషన్ కింద అంటే రూ. 20 వేల కోట్లను దిగమింగారని ధ్వజమెత్తారు. ఇందుకు సంబంధించి తన వద్ద అన్ని ఆధారాలూ ఉన్నాయని స్పష్టం చేశారు.

కేసీఆర్ పదేండ్లల్లో రూ. 4.17 లక్షల కోట్లు తెచ్చి లక్షలాది కోట్ల ఆస్తులు సృష్టించారని కవిత చెప్పారు. ఎన్నో నీటిపారుదల ప్రాజెక్టులు కట్టారని, విద్యుత్తు కేంద్రాలు నిర్మించారని, రోడ్లు వేశారని, పల్లెప్రగతికి బాటలు వేశారని పేర్కొన్నారు. కానీ, రేవంత్ ప్రభుత్వం రూ. 1.80 లక్షల కోట్ల అప్పు తెచ్చి ఒక్క రోడ్డు కూడా వేయలేదని, కనీసం చెరువుల్లో తట్టెడు మట్టి కూడా తీయలేదని విమర్శించారు. మాజీ సర్పంచుల బిల్లులు చెల్లించలేదని, ఆడబిడ్డల పెళ్లిళ్లకు తులం బంగారం ఇవ్వలేదని మండిపడ్డారు. తన మంత్రివర్గంలోని పెద్ద పెద్ద కాంట్రాక్టర్లకు మాత్రం బిల్లులు చెల్లించారని ఆరోపించారు.

యునెస్కో గుర్తింపు పొందిన ప్రపంచ వారసత్వ సంపద అయిన రామప్ప ఆలయం సమీపంలో సింగరేణి ఆధ్వర్యంలో ఓపెన్ కాస్టు గనులను ఏర్పాటు చేస్తామంటే ఎట్టి పరిస్థితుల్లోనూ ఒప్పుకొనేది లేదని ఎమ్మెల్సీ కవిత తేల్చి చెప్పారు. సోమవారం ఆమె ములు గు జిల్లా వెంకటాపూర్ మండలం పాలంపే టలోని రామప్ప ఆలయాన్ని సందర్శించి రుద్రేశ్వరుడికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. 2012లోనే రామప్ప ఆలయానికి 5 కిలో మీటర్ల దూరంలో ఓపెన్ కాస్టు మైన్ ఏర్పాటు కు ప్రయత్నిస్తే నాడు ఉద్యమ నాయకుడిగా కేసీఆర్ తీవ్రంగా వ్యతిరేకించారని గుర్తుచేశారు. తెలంగాణ ఏర్పాటు తర్వాత కూడా ఓపెన్ కాస్టు మైన్‌ల ఏర్పాటు ప్రయత్నాలను ముందుకు సాగనివ్వలేదని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ రాగానే మళ్లీ ఓపెన్ కాస్టు మైన్ల పేరుతో బొగ్గు తవ్వకాలకు ప్రయత్నాలు చేస్తున్నారని చెప్పారు. ఆలయానికి 5 కిలోమీటర్ల దూరంలో బ్లాస్టింగ్‌లు జరిపితే ఆలయం దెబ్బతినే ప్రమాదం ఉన్నదని ఆందోళన వ్యక్తం చేశారు. కేసీఆర్ హయాంలోనే రామప్పకు యునెస్కో గుర్తింపు వచ్చిందని గుర్తుచేశారు. ఏడాదిన్నరగా పట్టించుకోని మంత్రి సీతక్క ఇప్పుడు అందాల పోటీ కోసం రామప్ప వద్ద పైపై మెరుగులు దిద్దుతున్నారని దుయ్యబట్టారు. ఓ వైపు యుద్ధ వాతావరణం నెలకొంటే.. సీఎం మాత్రం అందాల పోటీల ప్రారంభోత్సవానికి హాజరయ్యారని అన్నారు. అనంతరం రా మాంజాపూర్‌లో నాంచారమ్మ జాతరకు హాజరై అమ్మవారికి పూజలు చేశారు. ఎరుకల కులస్తులతో సహపంక్తి భో జనం చేశారు. ఆలయ నిర్మాణానికి తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు. కార్యక్రమాల్లో కవిత వెంట బీఆర్ఎస్ ములుగు జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనర్సింహారావు, తెలంగాణ ఎరుకల అధ్యక్షుడు లోకిని రాజు, నాయకులు కేతిరి భిక్షపతి, రాజశేఖర్, లోకిని సమ్మయ్య, ఎం రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

# యుద్ధ విరమణ ఎందుకు

- **మంత్రి పొన్నం ప్రభాకర్**

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

కేంద్ర ప్రభుత్వం తీసుకున్న యుద్ధ విరమణ నిర్ణయంపై, ముఖ్యంగా దానిని ప్రకటించిన తీరుపై మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్రంగా స్పందించారు. దేశమంతా సైన్యానికి అండగా నిలిచిన కీలక సమయంలో, ఎలాంటి చర్చలు లేకుండా కేవలం 'ఎక్స్' వేదికగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ యుద్ధ విరమణ చేయడం ఆవేదన కలిగించిందని అన్నారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, మన సైనికులు ధైర్యసాహసాలతో పోరాడుతున్న వేళ, వారి త్యాగాలు ఒక కొలిక్కి రాకముందే యుద్ధాన్ని అర్ధాంతరంగా ఆపేయడం ద్వారా ప్రధాని మోదీ వారి పోరాట స్ఫూర్తిని నీరుగార్చారని ఆరోపించారు. "దేశమంతా ముక్తకంఠంతో సైన్యానికి సంఘీభావం ప్రకటించిన సమయంలో, కేంద్ర ప్రభుత్వం ఇలాంటి నిర్ణయం తీసుకోవడం దారుణం. ఒక్క ఎక్స్ పోస్టుతో దేశ సార్వభౌమత్వాన్ని ప్రధాని ప్రశ్నార్థకంగా మార్చారు" అని ఆయన వ్యాఖ్యానించారు. గతంలో ఇందిరాగాంధీ దాయాది దేశం విషయంలో వ్యవహరించినంత సమర్థవంతంగా మోదీ వ్యవహరించలేకపోయారని విమర్శించారు. చిన్న చిన్న ఘటనలు జరిగినప్పుడు నాటి ప్రధాని మన్మోహన్ సింగ్‌ను ప్రశ్నించిన మోదీ, ఇప్పుడు తాను తీసుకున్న నిర్ణయానికి ఏం సమాధానం చెబుతారని నిలదీశారు. దేశ ప్రజలు, కాంగ్రెస్ అధిష్టానం కేంద్ర ప్రభుత్వ చర్యలకు సంపూర్ణ మద్దతు ప్రకటించినప్పటికీ, ఇలాంటి కీలకమైన నిర్ణయాన్ని 'ఎక్స్' వేదికగా ప్రకటించడం దిగ్భ్రాంతికి గురిచేసిందని పేర్కొన్నారు. యుద్ధ విరమణకు దారితీసిన పరిస్థితులపై పార్లమెంట్ వేదికగా సమగ్ర చర్చ జరగాలని కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే ఇప్పటికే డిమాండ్ చేస్తున్నారని గుర్తుచేశారు. ఎలాంటి సంప్రదింపులు లేకుండా, కేవలం ఒక 'ఎక్స్' సందేశంతో యుద్ధాన్ని ఎందుకు విరమించాల్సి వచ్చిందో ప్రధాని మోదీ దేశ ప్రజలకు వివరణ ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.

అసదుద్దీన్ ఒవైసీ, ఎంఐఎం పార్టీ కూడా పాకిస్థాన్‌పై చేపట్టే చర్యలకు మద్దతు ప్రకటించిన తరుణంలో, యుద్ధాన్ని ఆపివేయాల్సిన ఆవశ్యకత ఎందుకు వచ్చిందని ప్రశ్నించారు. "దేశవ్యాప్తంగా ఈ నిర్ణయంపై తీవ్ర చర్చ జరుగుతోంది. ఒక భారతీయ పౌరుడిగా నేను ప్రధాన మంత్రిని దీనిపై ప్రశ్నిస్తున్నాను" అని అన్నారు. సైనికుల త్యాగాలు వృథా కాకూడదని, దేశ ప్రయోజనాల విషయంలో కేంద్ర ప్రభుత్వం బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆయన హితవు పలికారు.



# కార్మిక పక్షపాతి నాయిని

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

జీవితాంతం కార్మికుల హక్కులు, వారి అభ్యున్నతి కోసం కృషి చేసిన నాయిని నర్సింహారెడ్డి కార్మిక పక్షపాతిగా నిలిచిపోయారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కొనియాడారు. ఆయన ఆశయ సాధనకు మనమందరం కంకణబద్ధులమవుదామని పిలుపునిచ్చారు. తెలంగాణ కోసం మంత్రి పదవిని తృణప్రాయంగా వదులుకున్న గొప్ప నేత నాయిని అని కీర్తించారు. స్వరాష్ట్ర సాధన కోసం 22 ఏండ్ల పాటు కేసీఆర్ వెంట నడిచి ఉద్యమంలో కీలకభూమిక పోషించారని గుర్తుచేశారు. సోమవారం తెలంగాణ భవన్‌లో శాసన మండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి ఆధ్వర్యంలో మాజీ హోం మంత్రి నాయిని నర్సింహారెడ్డి 85వ జయంత్యుత్సవాలను ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా నాయిని చిత్రపటానికి కేటీఆర్, మధుసూదనాచారి, మాజీ మంత్రులు మహమూద్‌అలీ, శ్రీనివాస్‌గౌడ్, ఎర్రబెల్లి దయాకర్‌రావు, కుత్బుల్లాపూర్, గోషామహల్ ఎమ్మెల్యేలు వివేకానందగౌడ్, ముఠాగోపాల్, నాయిని తనయుడు దేవేందర్‌రెడ్డి, అల్లుడు శ్రీనివాస్‌రెడ్డి, కార్పొరేషన్ మాజీ చైర్మన్ గజ్జెల నగేశ్, తుల ఉమ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ ఉద్యమ సమయంలో తామందరికీ పెద్దన్నలా నాయిని దారిచూపారని గుర్తుచేశారు. వీఎస్టీ ఫ్యాక్టరీలో కార్మిక నేతగా ఆయన ఎన్నో పోరాటాలు చేసి హక్కులను సాధించారని పేర్కొన్నారు. తెలంగాణ తొలి హోంమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాయిని ఉద్యమకారులపై కేసులను ఎత్తివేయించారని తెలిపారు.

# ముంపు గ్రామాల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నాం

**- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్..**



**బలగం టీవీ, వేములవాడ**

ముంపు గ్రామాల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని, ముంపు గ్రామాల్లోని ప్రజలకు 4696 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయడం జరిగిందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ పట్టణంలోని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ నివాసంలో వేములవాడ అర్బన్ మండలం రుద్రవరం గ్రామం నుండి బీజేపీ,బిఆర్ఎస్, బీఎస్పీ పార్టీకి చెందిన పలువురు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరగా, వారికి పార్టీ కండువా కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ వివిధ పార్టీల నుండి కాంగ్రెస్ పార్టీలో చేరడాన్ని స్వాగతిస్తున్నామని,నేటి నుంచి వారు కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులే వారు ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉంటూ ప్రజా సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయాలని అన్నారు.రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా పని చేయాలని,ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి సంక్షేమంలో ముందుకు పోతుందని అన్నారు.

ముఖ్యమంత్రి ఆర్థికంగా చితికిపోయిన రాష్ట్రాన్ని అన్ని రకాలుగా సరిదిద్దుతూ గాడిలో పెడుతున్నారని అన్నారు.దేశంలో ఎక్కడా లేనివిధంగా తెలంగాణ రాష్ట్రంలో పేద ధనికా తేడా లేకుండా ప్రతి ఒక్కరికి సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని అన్నారు.

ప్రభుత్వంలో మహిళా తల్లులకు ఉచిత బస్సు ప్రయాణం, 500 సిలిండర్, 200 యూనిట్లకు ఉచిత విద్యుత్, రైతు రుణమాఫీ వంటి ఎన్నో సంక్షేమ పథకాల అమలు చేస్తూ ముందుకు పోతున్నామని అన్నారు.

వేములవాడ నియోజకవర్గం లో సాగునీటి ప్రాజెక్టుల పని శరవేగముగా కొనసాగుతున్నాయని,గత వారం రోజుల క్రితం మల్కపేట రిజర్వాయర్ కుడి కాలువ నుండి నీటిని దిగువ విడుదల చేసుకున్నామని,ఎడమ కాలువ పూర్తి చేసుకుని నిమ్మ పెల్లి వరకు నీళ్లు ఇచ్చే ప్రక్రియ చేపడతామని,

తద్వారా నియోజకవర్గంలో పాటు ఎగువన భూగర్భ జలాలు ఇంకిపోకుండా తాగునీటికి సాగునీటికి ఇలాంటి ఇబ్బంది లేకుండా ఉంటుందని అన్నారు గత పది సంవత్సరాలుగా జరగని అభివృద్ధి పనులను ప్రజా ప్రభుత్వంలో చేసుకుంటూ ముందుకు పోతున్నామని అన్నారు.అభివృద్ధిలో ఆటంకాలు సృష్టించాలనుకునే వారికి ఒకటే విజ్ఞప్తి చేస్తున్నా,మీ ఆలోచనలకు మీ సూచనలకు అనుగుణంగా ముందుకు పోవడానికి సిద్ధంగా ఉన్నామని,రాజకీయాలకు,పార్టీలకు అతీతంగా అభివృద్ధి చేసుకుందామని అన్నారు.

గత ప్రభుత్వం ధనిక రాష్ట్రం అని చెప్పి రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిందని,వారి పాలన తీరు పైన పటరం లోన లోటరం అన్నా చెందగా ఉండేదని అన్నారు.గత ప్రభుత్వం రాజన్న ఆలయాన్ని అభివృద్ధి చేస్తానని చెప్పి చేయలేదని,రాజన్న ఆలయ అభివృద్ధిలో ఎక్కడ కూడా ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా ముందుకు పోతున్నామని అన్నారు.రాజన్న భక్తులకు శీఘ్రంగా దర్శనం కలిగేలా ఆలయాన్ని విస్తీర్ణం చేస్తున్నామని,

రోడ్డు వెడెల్పు కు సంబంధించి 47 కోట్ల పరిహారం ఇప్పటికే మంజూరి అయ్యి కలెక్టర్ ఖాతాలో జమ అయ్యిందని అన్నారు.రోజు రోజుకు పెరుగుతున్న రాజన్న భక్తులను దృష్టిలో పెట్టుకొని ఆలయాన్ని అభివృద్ధి చేస్తున్నామని,శృంగేరి పీఠం వారి అనుమతులు తీసుకొని ఆలయ అభివృద్ధి చేపడుతున్నామని అన్నారు.ప్రభుత్వం తరపున ప్రతి అంశాన్ని బయట ప్రపంచానికి తెలిసేలా చేస్తున్నామని,విస్తరణ పనులు జరిగే సందర్భాల్లో భక్తులకు జరిగే దర్శనాలు భీమేశ్వర ఆలయంలో ఏర్పాటు చేస్తున్నామని అన్నారు.ప్రజలు,ప్రముఖులు, అనువంశిక అర్చకులు, వివిధ రాజకీయ పార్టీల వారు చెప్పిన సూచనలు సలహాలు తీసుకున్నమని,రాజకీయాలకు తావు లేకుండా ముందుకు పోతున్నామని అన్నారు.రాజన్న ఆలయ అభివృద్ధి విస్తరణ విషయంలో మీరు చెప్పే సూచనలు సలహాలను ప్రభుత్వం తప్పకుండా వింటుందని,అందరి అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోవడం జరుగుతుందని అన్నారు.

# గోవులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

**-గోశాల షెడ్లలో ఫాగర్స్ (నీటి తుంపర్ల) యంత్రాలను ఏర్పాటు చేయాలి**

**-కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**

**బలగం టీవీ, వేములవాడ**

వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి గోశాలలోని గోవుల సంరక్షణ పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆలయ అధికారులను కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. సోమవారం వేములవాడ తిప్పాపూర్ లోని గోశాలను కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడతూ ఎండా కాలం నేపథ్యంలో గోవుల సంరక్షణను మరింత బాధ్యతగా చూసుకోవాలని సూచించారు. నిత్యం వాటికి అందించే దాణా, మేత, తాగునీరు విషయాలను జాగ్రత్తగా పరిశీలించాలని ఆదేశించారు. వాటికి టీకాలు, ఇతర అంశాలపై దృష్టి పెట్టాలని సూచించారు.

**గోవుల వయసు ఆధారంగా...**

గోవుల వయసు ఆధారంగా వాటిని వివిధ షెడ్ లలో పెట్టాలని, గోశాలలోని షెడ్లలో ఫాగర్స్ (నీటి తుంపర్ల) యంత్రాలను ఏర్పాటు



చేయాలని ఆదేశించారు. అన్ని గోవులకు సరిపడా పచ్చిగడ్డిని మరింత అందుబాటులో ఉంచాలని సూచించారు. ప్రతి గోవుకు జియో ట్యాగింగ్ తో కూడిన పరికరాన్ని పెట్టాలని తద్వారా కోడెల పంపిణీ అనంతరం వాటి యొక్క లొకేషన్ ట్రాకింగ్ చేయవచ్చని పేర్కొన్నారు. వీటిని త్వరితగతిన సేకరించాలని అధికారులు సూచించారు. అనంతరం గోవులకు గాలికుంటు వ్యాధి నివారణ వ్యాక్సిన్లు వేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో వినోద్, జిల్లా పశు వైద్యాధికారి రవీందర్ రెడ్డి, ఆలయ ఏఈవో శ్రీనివాస్, గోశాల నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

# అమరులైన వీర జవాన్లకు మండేపల్లి గ్రామ యువత ఘన నివాళులు

**బలగం టీవీ, తంగళ్లపల్లి**




దేశ భద్రతలో ప్రాణాలు పణంగా పెట్టి వీర మరణం పొందిన భారత జవాన్లకు మండేపల్లి గ్రామ యువకులు ఘన నివాళులర్పించారు. గ్రామంలో కొవ్వొత్తులతో ర్యాలీ తీసి వీర జవాన్ల మరణానికి కొద్దిసేపు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. మాతృ భూమి కోసం అమరులై ప్రాణాలర్పించిన వీర జవాన్ల సేవలు దేశం మరువదని అన్నారు.దేశం కోసం వారు చేసిన సేవలు వృధా కావని,అమరులైన మా స్మృతిలో ఉంటారని,యావత్తు దేశం మీ త్యాగాలను స్మరించుకుంటుందని,పాక్ భారత్ మధ్య జరిగిన కాల్పుల్లో భారత్ సైనికులు ప్రాణాలు కోల్పోవడం విషాదకరమని వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమం లో రాగిపెల్లి కృష్ణారెడ్డి, నక్క రవి,చెన్నమనేని ప్రశాంత్, గోనపెల్లి శ్రీనివాస్ గౌడ్, అసాని మైపాల్ రెడ్డి, యాస మధు, అమరగొండ రాజు,పెద్ది రఘు, దుర్మట్ల లచ్చిరెడ్డి, జగ్గాని జెలందర్,ధర్మ రెడ్డి చందు,తిమ్మనగరం సందీప్,బండి భాస్కర్ గౌడ్,గడ్డం రాము, యాస రాజేష్,గంట పర్శరాములు, జగ్గాని శ్రీకాంత్,పాతూరి నరేష్, నక్క బాలకషన్ చిన్నారులు గాధగోని నిహాంత్, గదగోని త్రినయ్, హర్షిత్,పెద్ది అకుల్, నిత్య విద్య చరణ్, హర్ష మరియు గ్రామ యువత తదితరులు పాల్గొన్నారు.



# నిర్ణీత గడువులోగా దరఖాస్తులు పరిష్కరించాలి..

**- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

ప్రజావాణిలో వచ్చే ప్రతి దరఖాస్తును నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో సోమవారం ప్రజావాణి నిర్వహించి, ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా దరఖాస్తుదారులతో కలెక్టర్ నేరుగా మాట్లాడి, వారి సమస్యలను సానుకూలంగా స్పందించారు. ప్రజావాణి ద్వారా వచ్చే అర్జీల పరిష్కారంలో జాప్యం వద్దని అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమం లో డీఆర్డీఓ శేషాద్రి, జిల్లా అధికారులు , మండల స్థాయి అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# ఎస్‌హెచ్‌జీ సభ్యులకు ఎరువులు పురుగు మందుల దుకాణాలు..

**- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

ఇందిరా మహిళా శక్తి లో భాగంగా జిల్లాలోని ఎనిమిది మహిళా స్వశక్తి సంఘాలకు ఎరువులు, పురుగు మందులు, విత్తనాల విక్రయ కేంద్రాల లైసెన్సు లను పంపిణీ చేసినట్లు కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తెలిపారు. ఇందిరా మహిళా శక్తి కింద ఎస్ హెచ్ జీ లు ఆర్థికంగా ఎదగాలని ఉద్దేశంతో జిల్లాలోని పలు సంఘాల బాధ్యులకు జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో ఎనిమిది మహిళా స్వశక్తి సంఘాలకు లైసెన్సు లను కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పంపిణీ చేశారు.

వేములవాడలోని శ్రీ ధనలక్ష్మి మండల సమాఖ్య సీడ్స్ అండ్ ఫెర్టిలైజర్స్, ముస్తాబాద్ లోని గాయత్రి గ్రామైక్య సంఘం ఫెర్టిలైజర్స్ అండ్ సీడ్స్, బోయినపల్లి మండలం విలాసాగర్ గ్రామైక్య సంఘం ఫెర్టిలైజర్స్ అండ్ సీడ్స్, వేములవాడ శివరామ్ గ్రామైక్య సంఘం ఫెర్టిలైజర్స్ అండ్ సీడ్స్, కోనరావుపేట విశ్వదర్శిని గ్రామ సమాఖ్య సంఘం, గంభీరావుపేట విజయలక్ష్మి గ్రామైక్య సంఘం ఫెర్టిలైజర్స్ అండ్ సీడ్స్, ఎల్లారెడ్డిపేట మండలం కోరుట్లపేట భాగ్యశ్రీ గ్రామైక్య సంఘం, తంగళ్ళపల్లి వినాయక పెస్టిసైడ్స్ అండ్ సీడ్స్ వారికి విక్రయాల లైసెన్సులు అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఓ శేషాద్రి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అఫ్జలి బేగం అదనపు డీఆర్డీఓ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# గాంధీ ఆస్పత్రిలో తాగునీటి ప్లాంట్ ప్రారంభం

**బలగం టీవీ, హైదరాబాద్**




రోగులు, వారి సహాయకులు, సందర్శకుల తాగునీటి అవసరాల కోసం కొత్తగా 23 చోట్ల తాగునీటి ప్లాంట్‌లను ఏర్పాటు చేశామని గాంధీ దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ సీహెచ్ రాజకుమారి అన్నారు. దివిస్ లాబొరేటరీస్ లిమిటెడ్ సంస్థ సామాజిక బాధ్యతలో భాగంగా రూ. 72 లక్షల వ్యయంతో సుజలం సురక్షిత తాగునీరు పేరుతో 23 చోట్ల ఆర్వో వాటర్ ప్యూరిఫికేషన్ యూనిట్లను నెలకొల్పింది. ఎక్కువగా ప్రజలు ఉండే ఓపీ భవనం, క్యాజువాలిటి ఎదురుగా, డైట్ భవనం, ఎంసీహెచ్ భవనం వద్ద నాలుగు పెద్ద ప్లాంట్‌లను సోమవారం ఆమె ప్రారంభించారు. అన్ని ఫ్లోర్‌లలో కూడా వాటర్ కూలర్‌లను ప్రజల కోసం ఏర్పాటు చేశామని, తద్వారా తాగునీటి లభ్యత అన్నిచోట్లా అందుబాటులో ఉన్నదని ఆమె అన్నారు. దాతలకు ఆమె ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమంలో దివీస్ ల్యాబ్ ప్రతినిధులు నగేష్, శ్రీనివాస్, ఆర్ఎంఓలు డాక్టర్ శేషాద్రి, సుధార్ సింగ్, రజినీ, యోగేందర్, నవీన్, సుధీర్, సరిత, మీనాక్షి, కల్యాణ్ చక్రవర్తి, నజీమ్, సీఎంఓ రాజు పాల్గొన్నారు.

# టెస్టుల్లో కింగ్



బలగం టీవీ, హైదరాబాద్

భారత స్టార్ బ్యాట్ విరాట్ కోహ్లీ ఫ్యాన్స్‌కు ఊహించని షాక్ ఇచ్చాడు.14 ఏళ్ల టెస్టు కెరీర్‌కు అతడు గుడ్‌బై చెప్పేశాడు. దీంతో కింగ్ విరాట్ టెస్ట్ ఇన్నింగ్స్‌లను ఫ్యాన్స్ తలచుకుని సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు.

విరాట్ కోహ్లీ 2011 జూన్ 20న కింగ్స్టన్ లో వెస్టిండీస్‌తో తన టెస్ట్ అరంగేట్రం చేశాడు. టెస్ట్ క్రికెట్‌లో తన తొలి సెంచరీని 2012 జనవరిలో అడిలైడ్ ఓవల్‌లో ఆస్ట్రేలియాపై సాధించాడు. 2014లో అడిలైడ్‌లో ఆస్ట్రేలియాపై టెస్ట్ కెప్టెన్‌గా విరాట్ కోహ్లీ అద్భుతమైన అరంగేట్రం చేశాడు. 2014/15 సీజన్‌లో తొలి ఇన్నింగ్స్ లో 115, రెండో ఇన్నింగ్స్ లో 141 పరుగుల అద్భుతమైన ఇన్నింగ్స్‌లతో టెస్టులో రెండు ఇన్నింగ్స్‌లలో సెంచరీ సాధించిన నాల్గవ భారత బ్యాటర్‌గా చరిత్ర సృష్టించాడు.

## 68 మ్యాచ్‌లలో నాయకత్వం

విరాట్ కోహ్లీ 68 మ్యాచ్‌లలో భారత జట్టుకు నాయకత్వం వహించి, అత్యధిక టెస్ట్ మ్యాచ్‌లలో భారత్‌కు నాయకత్వం వహించిన రికార్డును కలిగి ఉన్నాడు. కోహ్లీ నాయకత్వంలో, భారత్ 40 మ్యాచ్‌లలో విజయం సాధించింది. ఇది ఏ భారత టెస్ట్ కెప్టెన్‌కైనా అత్యధికం.

విరాట్ కోహ్లీ కెప్టెన్సీలోని గొప్ప విజయాలలో ఒకటి 2018-19 సీజన్‌లో ఆస్ట్రేలియాపై చారిత్రాత్మక 2-1 సిరీస్ విజయం. ఇది ఆస్ట్రేలియా గడ్డపై టీమ్ ఇండియాకు మొదటి టెస్ట్ సిరీస్ విజయం. తద్వారా 71 సంవత్సరాల సుదీర్ఘ నిరీక్షణకు తెరపడింది. అతని నాయకత్వంలో, భారత్ టెస్ట్ ర్యాంకింగ్స్‌లో నంబర్ వన్ స్థానానికి చేరుకుని, 42 వరుస నెలల పాటు అగ్రస్థానంలో కొనసాగింది. సొంతగడ్డపై అతని కెప్టెన్సీలో భారత్ టెస్ట్ సిరీస్‌లలో అజేయంగా నిలిచింది మరియు అతను నాయకత్వం వహించిన 11 సిరీస్‌లలో 10 సిరీస్‌లను గెలుచుకుంది.

టెస్ట్‌ల్లో అత్యధిక డబుల్ సెంచరీలు చేసిన టీమ్‌ఇండియా ప్లేయర్‌గా విరాట్(7) నిలిచాడు. సచిన్, సెహ్వాగ్ రికార్డులను బ్రేక్ చేశాడు. వరుసగా నాలుగు టెస్ట్ సిరీసుల్లో నాలుగు డబుల్ సెంచరీలు చేసిన ఏకైక బ్యాటర్ కోహ్లీనే. రాహుల్ ద్రవిడ్, డాన్ బ్రాడ్‌మెన్‌ను అధగమించాడు.

## మరికొన్ని రికార్డులు..

ఒక క్యాలెండర్ సంవత్సరంలో అత్యధిక పరుగులు చేసిన భారతీయ బ్యాట్స్‌మన్ – 2012, 2015, 2016, 2018, 2023, భారత కెప్టెన్ అత్యధిక స్కోరు: 254 వర్సెస్ దక్షిణాఫ్రికా (2019), భారత కెప్టెన్‌గా అత్యధిక సెంచరీలు: 20, ఆస్ట్రేలియాలో ఒక టీమ్‌ఇండియా ప్లేయర్ సాధించిన అత్యధిక సెంచరీలు: 7, కెప్టెన్‌గా అత్యధిక డబుల్ సెంచరీలు: 6, బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో ఒక ఇండియన్ ప్లేయర్ సంపాదించిన అత్యధిక రేటింగ్ పాయింట్లు: 937 (2018), కెప్టెన్‌గా వరుసగా అత్యధిక టెస్ట్ సిరీస్ విజయాలు: 9

అయితే టెస్టుల్లో ఎన్నో గొప్ప ఇన్నింగ్స్‌లు ఆడిన విరాట్, పది వేల పరుగుల మైలురాయికి కొద్ది దూరంలోనే నిలిచాడు. కానీ ఇంతలోనే ఫార్మాట్ నుంచి వైదొలిగాడు.

# టెస్టులకు కోహ్లీ గుడ్‌బై



- ఇన్‌స్టా వేదికగా పోస్ట్
- భారత టెస్ట్ క్రికెట్ చరిత్రలో ఓ శకం ముగిసిందన్న బీసీసీఐ

బలగం టీవీ, హైదరాబాద్

14 ఏళ్ల సుదీర్ఘ కెరీర్, 123 టెస్టు మ్యాచుల అనుభవం, 9,230 పరుగులు, 30 సెంచరీలు కలిగి గత దశాబ్ద కాలంలో వరల్డ్ క్రికెట్‌ను శాసించిన విరాట్ కోహ్లీ టెస్టు మ్యాచ్‌లకు గుడ్‌బై చెప్పేశాడు.ఇప్పటికే టీ20లకు రిటైర్మెంట్ ప్రకటించిన విరాట్.. ఇక నుంచి వన్డేల్లో మాత్రమే కొనసాగుతానని క్లారిటీ ఇచ్చాడు. సుదీర్ఘ కెరీర్‌లో తనకు సహకరించిన బీసీసీఐ, ఫ్యామిలీ మెంబర్స్, ఫ్యాన్స్‌కు అతడు థ్యాంక్స్ చెప్పాడు.

విరాట్ సోమవారం తన ఇన్‌స్టా అకౌంట్‌లో ఓ భావోద్వేగపూరిత పోస్టును పెట్టాడు. టెస్టు క్రికెట్‌లో దేశం తరపున అరంగేట్రం చేసి 14 ఏళ్లు అవుతున్నట్లు కోహ్లీ తన పోస్టులో తెలిపాడు. టెస్టు ఫార్మాట్ తనకు ఎంతో నేర్పిందని, తనను పరీక్షించిందని, తతను తీర్చిదిద్దిందని, జీవితానికి కావాల్సిన ఎన్నో పాఠాలు నేర్పినట్లు కోహ్లీ పేర్కొన్నాడు. తెలుపు రంగు దుస్తుల్లో ఆడడం ఎంతో ప్రత్యేకంగా ఉంటుందన్నారు. టెస్టు ఫార్మాట్‌ను వీడడం సులువైన అంశం కాదు అని, కానీ సరైన సమయం అని, ఆ ఫార్మాట్ ఎంతో చేశానని, తనకు కూడా ఎంతో కలిసి వచ్చిందన్నారు. ఊహించినదాని కన్నా ఎక్కువే లాభం జరిగిందన్నాడు.

కోహ్లీ 123 టెస్టు మ్యాచ్‌లు ఆడాడు. 68 మ్యాచ్‌లకు అతను కెప్టెన్‌గా చేశాడు. బ్యాటింగ్ సగటు 46.85తో అతను 9230 రన్స్ చేశాడు. జూన్‌లో ఇంగ్లండ్‌తో అయిదు టెస్టు మ్యాచ్‌ల సిరీస్ ప్రారంభంకానున్న నేపథ్యంలో కోహ్లీ తన నిర్ణయాన్ని వెల్లడించారు. గత కొన్ని రోజుల నుంచి కోహ్లీ టెస్టు రిటైర్మెంట్‌పై చర్చ జరుగుతోంది. రోహిత్ తరహాలోనే టెస్టు నుంచి తప్పుకునేందుకు కోహ్లీ సిద్ధంగా ఉన్నట్లు వార్తలు వ్యాపించాయి. అయితే తన రిటైర్మెంట్ నిర్ణయాన్ని కోహ్లీ.. బీసీసీఐకి చెప్పినట్లు కూడా తెలుస్తోంది. వాస్తవానికి టెస్టు ఫార్మాట్‌లో కోహ్లీ పెద్దగా ఫామ్‌లో లేడు. ఇటీవల ఆస్ట్రేలియాతో జరిగిన టెస్టు సిరీస్ పెర్త్ మ్యాచ్‌లో కోహ్లీ సెంచరీ కొట్టాడు. సుమారు ఏడాది గ్యాప్ తర్వాత అతను ఆ ఇన్నింగ్స్ ఆడాడు. ఓ దశలో టెస్టుల్లో కోహ్లీ యావరేజ్ టాప్‌గా ఉండేది. టాప్ ఫామ్‌లో ఉన్న సమయంలో కోహ్లీ టెస్టు యావరేజ్ 55.10గా ఉంది. కానీ గత 24 నెలల్లో అతను టెస్టు యావరేజ్ 32.56కు పడిపోయింది. అనుభవం దృష్ట్యా.. ఇంగ్లండ్ టూరుకు అవసరం ఉన్నా.. కోహ్లీ తనంతటే తానే తప్పుకుంటున్నట్లు తెలుస్తోంది. టెస్టుల్లో కోహ్లీ 30 సెంచరీలు, 31 హాఫ్ సెంచరీలు చేశాడు.

## కోహ్లీకి బీసీసీఐ థాంక్యూ

టీమ్ ఇండియా మాజీ కెప్టెన్ విరాట్ కోహ్లీ టెస్ట్ క్రికెట్ నుంచి రిటైర్మెంట్ ప్రకటించిన నేపథ్యంలో బీసీసీఐ స్పందించింది. థాంక్యూ కోహ్లీ అంటూ సోషల్ మీడియా ద్వారా కృతజ్ఞతలు తెలియజేసింది. భారత క్రికెట్ టెస్ట్ చరిత్రలో ఓ శకం ముగిసిందని, టీమ్ ఇండియాకు కోహ్లీ అందించిన సేవలు ఎప్పటికీ గుర్తుండిపోతాయని పేర్కొంది.

విరాట్ కోహ్లీ భారత్ తరపున దాదాపు 14 ఏళ్ల పాటు టెస్టులకు ప్రాతినిధ్యం వహించారు. 2011లో వెస్టిండీస్ తో మ్యాచ్ ద్వారా ఆయన టెస్టుల్లో అరంగేట్రం చేశారు. తన కెరీర్‌లో కోహ్లీ 123 టెస్టు మ్యాచ్‌లు ఆడి 30 సెంచరీలు, 31 హాఫ్ సెంచరీలతో మొత్తం 9,230 పరుగులు చేశారు. 2025 జనవరి 3న ఆస్ట్రేలియాతో కోహ్లీ చివరి టెస్టు ఆడారు. కాగా, ఇటీవలే రోహిత్ శర్మ కూడా టెస్ట్ క్రికెట్‌కు రిటైర్ మెంట్ ప్రకటించడం తెలిసిందే.




## ‘ఓజీ’ షూటింగ్ షురూ..

బలగం టీవీ, హైదరాబాద్

పవర్ స్టార్ పవన్ కల్యాణ్, యువ దర్శకుడు సుజీత్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న చిత్రం ‘ఓజీ’. చాలా కాలంగా ఈ మూవీ షూటింగ్ వాయిదా పడ్డ విషయం తెలిసిందే. అయితే, ఈ చిత్రం షూటింగ్ తిరిగి సోమవారం పునఃప్రారంభమైనట్లు మేకర్స్ ప్రకటించారు. ఇందుకు సంబంధించిన ఓ ఫొటోను నిర్మాణ సంస్థ డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్ ఎక్స్ (ట్విట్టర్) వేదికగా అభిమానులతో పంచుకుంది. “మళ్లీ మొదలైంది... ఈసారి ముగిద్దాం” అనే క్యాప్షన్ తో షూటింగ్ స్పాట్ ఫొటోను షేర్ చేశారు. అయితే, షూట్‌లో పవర్ స్టార్ పాల్గొన్నారా లేదా అనేది క్లారిటీ లేదు. పవన్ కల్యాణ్‌తో పాటు ఇమ్రాన్ హష్మి, అర్జున్ దాస్, శ్రియా రెడ్డి ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. పవర్‌స్టార్ సరసన ప్రియాంక మోహనన్ హీరోయిన్‌గా నటిస్తుంది. ప్రముఖ నిర్మాత డీవీవీ దానయ్య భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న ఈ చిత్రానికి తమన్ సంగీతం అందిస్తున్నారు.

## సినిమాల్లోకి మరో నందమూరి తారక రామారావు

బలగం టీవీ, హైదరాబాద్

నందమూరి హరికృష్ణ మనవడు, జానకీరామ్ కుమారుడు నందమూరి తారక రామారావు హీరోగా పరిచయమవుతున్న విషయం తెలిసిందే. ప్రముఖ దర్శకుడు వైవీఎస్ చౌదరి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రం సోమవారం పూజా కార్యక్రమాలతో లాంఛనంగా ప్రారంభమైంది. ఈ వేడుకకు నారా భువనేశ్వరి, దగ్గుబాటి పురందేశ్వరి, గారపాటి లోకేశ్వరి తదితరులు హాజరయ్యారు. నారా భువనేశ్వరి హీరో హీరోయిన్లపై క్లాప్ కొట్టి వారిని అభినందించారు. అయితే ఈ మూవీ ప్రారంభమైన సందర్భంగా.. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సోషల్ మీడియా వేదికగా తారక రామారావుకు శుభాకాంక్షలు తెలిపారు. “తారక రామారావు ఇండస్ట్రీలో అడుగుపెడుతున్న సందర్భంగా ఆయనకు నా హృదయపూర్వక శుభాకాంక్షలు. ఎన్టీఆర్ గొప్ప విజయాలు అందుకోవాలని కోరుకుంటున్నాను” అని సీఎం



చంద్రబాబు తన పోస్ట్‌లో పేర్కొన్నారు.

మూవీ ప్రారంభోత్సవం అనంతరం హీరో తారక రామారావు మాట్లాడుతూ, “మా ముత్తాత ఎన్టీఆర్, మా తాత హరికృష్ణ, మా నాన్న జానకీరామ్ ఆశీస్సులు ఎల్లప్పుడూ నాతోనే ఉంటాయని నమ్ముతున్నాను. ఈ రోజు నా కుటుంబ సభ్యులందరూ నన్ను ప్రోత్సహించడానికి ఇక్కడికి రావడం ఎంతో సంతోషాన్నిచ్చింది. ప్రేక్షకుల ప్రేమాభిమానాలే నన్ను ముందుకు నడిపిస్తాయని నమ్ముతున్నాను. ఈ ప్రాజెక్ట్ ప్రకటించినప్పటి నుంచి మీడియా ఎంతో సహకరించింది. వారందరికీ కృతజ్ఞతలు” అని అన్నారు.

## నిలకడగా నటుడు విశాల్ ఆరోగ్యం

బలగం టీవీ, హైదరాబాద్

నటుడు విశాల్ ఆదివారం విల్లుపురంలో జరిగిన మిస్ కూవగం కార్యక్రమంలో పాల్గొన్నప్పుడు ఒక్కసారిగా వేదికపై కుప్పకూలిపోయిన విషయం తెలిసిందే. ఇందుకు సంబంధించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో అభిమానులు ఆందోళనకు గురయ్యారు. ఈ నేపథ్యంలో విశాల్ ఆరోగ్యంపై ఆయన సొంత నిర్మాణ సంస్థ విశాల్ ఫిల్మ్ ఫ్యాక్టరీ అప్‌డేట్ ఇచ్చింది. “విశాల్ ఆరోగ్యం గురించి తాజాగా వచ్చిన వార్తలపై మేము స్పష్టత ఇవ్వాలనుకుంటున్నాం. ట్రాన్స్‌జెండర్ కమ్యూనిటీ నిర్వహించిన ఒక కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన విశాల్ కొద్దిసేపు అలసటతో స్పృహ కోల్పోయారు. ఆ రోజు మధ్యాహ్నం ఆయన భోజనం చేయలేదు. కేవలం జ్యూస్ మాత్రమే తాగారు. దాని వల్ల ఆయన అలసటతో స్పృహ కోల్పోయి పడిపోయారు. వెంటనే ఆయన్ని సమీపంలోని ఆసుపత్రికి తీసుకెళ్లాం. అక్కడ వైద్యులు క్షుణ్ణంగా పరీక్షించారు.అదృష్టవశాత్తూ, ఆందోళన చెందడానికి ఎటువంటి అనారోగ్య కారణం లేదన్నారు. విశాల్ ఆరోగ్యం బాగానే ఉందని వైద్య బృందం నిర్ధారించింది. విశ్రాంతి తీసుకుని కోలుకుంటున్నారు.” అని విశాల్ ఫిల్మ్ ఫ్యాక్టరీ పేర్కొంది.



## ఓటీటీలోకి ‘అర్జున్ సన్నాఫ్ వైజయంతి’

బలగం టీవీ, హైదరాబాద్

కల్యాణ్ రామ్, విజయశాంతి కలిసి నటించిన చిత్రం ‘అర్జున్ సన్నాఫ్ వైజయంతి’. ప్రదీప్ చిలుకూరి దర్శకత్వం వహించిన ఈ మూవీ ఏప్రిల్ 18న థియేటర్లోకి వచ్చింది. అయితే, ఈ మూవీ అప్పుడే మే 12 నుంచి ఓటీటీ స్ట్రీమింగ్‌కు వచ్చేసింది. ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ అమెజాన్ ప్రైమ్ వీడియోలో స్ట్రీమింగ్ అవుతోంది. విడుదల అయి నెల రోజులు కూడా కాకముందే, అది కూడా ఎలాంటి ముందస్తు ప్రకటన లేకుండానే ఓటీటీలోకి వచ్చేయడం అందరినీ షాక్‌కు గురిచేసింది. అయితే, ఇందులో చిన్న ట్విస్ట్ ఉంది. ఈ మూవీ తెలుగు వెర్షన్ స్ట్రీమింగ్ కేవలం యూకేలో ఉన్నవాళ్లకి మాత్రమే అందుబాటులో ఉంది. అది కూడా అద్దె విధానంలో మాత్రమే వీక్షించే వెసులుబాటు ఉంది. కాగా, గురు లేదా శుక్రవారం నుంచి ఇండియాలో కూడా సినిమా మనవాళ్లకు అందుబాటులోకి రావొచ్చని సమాచారం. ఇక, ‘అర్జున్ సన్నాఫ్ వైజయంతి’లో బాలీవుడ్ నటులు అర్జున్ రాంపాల్, సోహైల్ ఖాన్ లతో పాటు బబ్లూ పృథ్వీరాజ్, చరణ్ రాజ్, శ్రీరామ్ కీలక పాత్రల్లో నటించారు. కల్యాణ్ రామ్‌కు జోడిగా సయీ మంజ్రేకర్ నటించగా... అజనీశ్ లోక్‌నాథ్ మ్యూజిక్ అందించారు.